## వైద్య ఖర్చులకు 52,500 సహాయం

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని నరసింగపల్లి గ్రామనికి చెందిన జామాన వాసు కి ఇటీవల అనుకోని ప్రమాదం సంభవించి స్పాండిలైటిస్ సర్జరీ చేయించుటకు ఆ కుటుంబం పడే ఇబ్బంది గమనించి ఆ గ్రామంలో పెద్దలు, యువకులు విరాళాలు సేకరించి 52,500/- వైద్య ఖర్చులు నిమిత్తం ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలాకి షణ్ముఖ్ రావు, రౌతు బాలరాజు, దారపు పాపారావు, ఎన్ని షణ్ముఖ రావు, దారపు ధర్మారావు, రట్టి బైరగి, పోలాకి తిరుపతి రావు, ముప్పార్తి కృష్ణారావు, పొట్నూరు గుణాకర్ మరియు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.




విశాలాంధ్ర శ్రీకాకుళం

సోమవారం 13, అక్టోబర్, 2025




# రామయ్యా...

# నాకిచ్చిన మాట ఏమయ్యింది..!

- పార్లమెంట్‌లో చర్చించావు.. అసంపూర్తిగానే వదిలేశావు
- దశాబ్దాల కళ నెరవేరేదెప్పుడు?
- నా ప్రాంతవాసులకు మెరుగైన సేవలు అందించలేనా !
- హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ ఆత్మఘోష

విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం :

'నా ప్రాంత బిడ్డ, నా ఎర్రన్న బిడ్డ కేంద్ర మంత్రిగా ఎన్నో విమానాశ్రయాలు నిర్మిస్తుంటే, నన్ను మాత్రం పట్టించుకోవడంలేదని బాధ కలుగుతుందంటూ హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ ఆత్మ గోషిస్తుంది. నా ప్రాంతంలో పుట్టి పెరిగి, నా వైపు గానే ప్రయాణం చేసి దేశ రాజధానిలో అత్యున్నత పదవులు చేపట్టిన ఎవరు కూడా నా అభివృద్ధికి పాటుపడలేదు. నా ప్రాంత ప్రజలు అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని లా... దగ్గర్లోనే రైల్వే స్టేషన్ ఉన్న రైలు ప్రయాణం చేయలేని, వారికి నేను అందించలేని దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నానా అంటూ నాలో నేనే నిత్యం కుమిలిపోతున్నాను. నా ప్రాంత ప్రజలు చాలా వరకు మూడు పూటలా తినేందుకు కూడా లేని పరిస్థితి. తక్కువ డబ్బుతో సుదూర ప్రయాణం చేయవచ్చనే ఆశతో రైలుబండ్లు ఆలస్యమైనా, నా వద్ద ఒకటి రెండు రైలు బల్లు ఎక్కేందుకే ఆస్కారం ఉన్నా ఎండకు ఎండి వానకు తడిసి పడిగాపులు కాసిన ఎందరో ప్రయాణికుల కష్టాలను చూసి నా కళ్ళు చమర్చాయి. పాలకులు నన్ను అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రతిసారి ఆనందపడి నేను ఎప్పుడు పూర్తిస్థాయిలో నా ప్రాంత ప్రజలకు సేవలందిస్తానా అంటూ కళ్ళకు కాయలు కాసేలా ఎదురు చూస్తూనే ఉన్నా. ఎదురుచూసి చూసి నాలో ఆత్మవిశ్వాసమే సన్నగిల్లిపోతుంది రామన్న. నా ప్రాంత బిడ్డగా నువ్వు కేంద్ర మంత్రి అయ్యావంటే నేనెంతో ఆనందపడ్డా... నా ప్రాంత బిడ్డ పేరు దేశ విదేశాల్లో మార్మోగుతుంటే నాలో నేనే ఆనంద పడుతున్న. హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం పార్లమెంటులో చర్చించినప్పుడు నా ప్రాంత బిడ్డ నాకోసం ఇంత కష్టపడుతున్నాడని ఎంతో ఆనందించా. నా బిడ్డ పోరాటంతో నా ప్రాంత ప్రజల కష్టాలు నెరవేరుతాయి అని ఎదురు చూశా. నేటికీ నా ఆశ ఆశగానే ఉంది తప్ప కార్యరూపం దాల్చలేదనే ఆవేదనతో నా గుండె బరువెక్కుతుంది. నా వద్ద లాజిస్టిక్ పార్క్ పెడతామంటున్నారు దాంతో నా ప్రాంత ప్రజలకు ఏం లాభం ఉంటుందో తెలియదు గానీ, నా వద్ద ఒకటి రెండు ఎక్స్ప్రెస్ రైళ్లు ఆపితే ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని సేవలు అందించగలను. అమృత్ భారత్ పేరుతో ఎన్నో రైలు నిలయాలు అభివృద్ధి చేస్తున్న పాలకులు నన్నెందుకు విస్మరిస్తున్నారో అర్థం కాక నాలో నేనే తల్లడిల్లి పోతున్నాను. రైల్వే స్టేషన్ అభివృద్ధికి పూర్వంలో ఇక్కడ రైతులు భూములు త్యాగం చేస్తే ఇప్పుడా భూములు పంటకు పనికిరాక, రైలు నిలయం అభివృద్ధి కాన రాక బోసిపోతున్నాయి. పలాసలో విమానాశ్రయం నిర్మిస్తానన్నావు ఈ ప్రాంత వాసులకు ఎంతమందికి విమాన ప్రయాణానికి ఆర్థిక స్తోమత ఉంది. అందుకే ఉపాధి కోసం నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే మన ప్రాంత వాసులకు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు నన్ను అభివృద్ధి చేస్తే అటు రైల్వే ఖజానా నిండడంతో పాటు, నా ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణం సులభతరం చేస్తాను. రామన్న నువ్వు కేంద్ర మంత్రిగా ఉన్నావు నన్ను అభివృద్ధి చేయడం నీకు పెద్ద పని కాదు అనుకుంటున్నాను. నువ్వు రైల్వే మంత్రి పక్కనే కూర్చుంటావు అప్పుడైనా నా కోసం ఒకసారి ప్రస్తావించి అభివృద్ధి చేస్తావు అని కోరుతున్నా.... మీ తండ్రి ఎర్రన్నాయుడు కూడా నా పేరు ఉన్న హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానం మొదలై దేశ రాజధానిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. కాలక్రమేనా నియోజకవర్గం పేరు మారింది. ఆ పేరుతో ఉన్న నన్ను మరింత అభివృద్ధి చేస్తే ఈ పేరు మరిన్ని కాలాలు నిలుస్తుంది. నన్ను అభివృద్ధి చేయి నా ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలతో చూస్తున్నారు. నువ్వు చేస్తావని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తాను రామన్న. మర్చిపోవు కదా....నీవు అభివృద్ధి చేస్తే నీ మేలు ఈ ప్రాంత ప్రజలు మర్చిపోలేరు. నన్ను అభివృద్ధి చేయి.. చిన్నవాడివైనా నీకు చేతులెత్తి నమస్కరిస్తాను. నా ప్రాంత ప్రజల ప్రయాణానికి మరిన్ని సౌకర్యాలు కల్పించు. త్వరలోనే శుభవార్త వింటాను అనే ఆశతో ఎదురుచూస్తూ ఉంటాను" హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ ఆవేదనతో విన్నవించుకుంటుంది.

---

## కుక్కల దాడిలో పలువురికి గాయాలు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం మాణిక్య పురం గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ పలువురిని గాయ పరుస్తు న్నాయి. గత రెండు రోజు లగా గ్రామంలో కుక్కల దాడిలో 11 మంది గాయపడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పంధించి కుక్కల బాధ నుంచి విముక్తి చేయాలని కోరుతున్నారు. గాయపడిన బాధితులంతా సోంపేట సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కార్యదర్శి ఎం.మోహనరావును వివరణ కోరగా సంబంధిత అధి కారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నేడు (సోమవారం) ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరం లో ఉదయం 10:00 గంటలు నుండి నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్ల డించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే లి1100లి (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సి ఉంది

### మాజీ మంత్రి సీదిరి అప్పల రాజు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన సందర్భం రాష్ట్రంలో ఏర్పడుతుందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుఅన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హెపటైటిస్ ఏ తో కురుపాం విద్యార్థులు కేజిహెచ్‌లో జాయిన్ అయ్యారని, గుంటూరు జిల్లా అన్నపర్రు లో ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రి పాలైన ఘటనను గుర్తు చేశారు. హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పిహెచ్ సి లలో పనిచేసే డాక్టర్లు అందరూ విధులు మానేసి స్ట్రైక్ చేస్తున్న ప్రభుత్వానికి ఇసుమంత కూడా చలనం రాలేదని విమర్శించారు. కార్పోరేట్ ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీ కింద వైద్యం నిరాకరిస్తూ బోర్డులు పెట్టారని, నెట్వర్క్ ఆసు పత్రులకు చెల్లించాల్సిన నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మరో పక్క ప్రభుత్వ కాలేజిలు ప్రైవేట్ కి అప్పగిస్తామని జివో ఇచ్చారని, రాష్ట్రంలో మెడికల్ హెల్త్ రంగం పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం క్యాబినెట్ సమావేశాలు కేవలం భూములు కేటాయింపులకే నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఆరోగ్య శ్రీ ఆపేస్తుంటే కనీసం క్యాబినెట్ లో చర్చించరా అని నిలదీశారు. హెల్త్ మినిస్టర్ ఏం చేస్తున్నారంటూ, చిల్లర మాటలు మాట్లాడమే తెలుసా అని ప్రశ్నించారు. రూ. 2700 కోట్లు బాకీలు పెట్టుకుని హెల్త్ రంగాన్ని ఏం చేస్తున్నారన్నారు. డిపార్ట్మెంట్ కి చేసిన కేటాయింపులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ కొత్తగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తున్నారని, దీంతో అదనంగా రూ.1500ల కోట్లు భారం పడుతుందన్నారు. అది కూడా చికిత్స కేవలం రూ 2.5 లక్షల వరకే... పరిమితం చేశారని తెలిపారు. మెడికల్ కాలేజి లను అమ్మేస్తే రేపొద్దున ఆరోగ్య సేవ ఇవ్వరు కదా అని వివరించారు. ఇన్సురేన్స్ కంపెనీలకు టైం కి డబ్బులు ఇవ్వకపోతే.. వారు ఆరోగ్య సేవ వెంటనే నిలుపుదల చేస్తారని ,ఆ మాత్రం ప్రభుత్వ పెద్దలకు తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. లంచాల కోసమే ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. పార్వతీపురం మెడికల్ కాలేజీ భూసేకరణ జీవో ఆర్డర్ లేదంతున్నారని, నేను ఆర్డర్ చూపిస్తా.. మీరు మంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని సవాల్ చేశారు.తక్షణమే ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు రిలీజ్ చేయాలని డిమాండ్ చేసారు. గత ప్రభుత్వం బకాయిలు తీర్చాం అనడం సరికాదాని, లాస్ట్ క్వార్టర్ బిల్లులు ఏన్నికల కోడ్ నేపథ్యంలో ఏప్పుడూ ఉంటాయని గుర్తు చేశారు. బాలక్రిష్ణ మెడికల్ కాలేజిలు రూ. 212 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టా మంటున్నారని, ఏమైనా రూ. 212 కోట్లతో 5 మెడికల్ కాలేజీలు పూర్తై పోతాయా అలా అయితే అదే డబ్బులతో మిగిలినవి పూర్తి చేయండన్నారు. మెడికల్ కాలేజి అంటే విద్యే కాదు ఆసుపత్రి, చికిత్సలు ఉంటాయన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ మీద అవగాహన లేని వారందరూ కాలేజీల మీద వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కాలేజిలు అమ్మేయాలని చంద్రబాబు నిర్ణయించారని, దీనిపై సూడామేథావులు రంగంలోకి దించాడు అని విమర్శించారు. పేదలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసం మీద ప్రభుత్వ తీరును ఎండగడతామన్నారు.

## సిక్కోలుకు ఉపాధి చేరువ చెయ్యడమే రామన్న లక్ష్యం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- మాక్ టెస్ట్ కు 120 మంది విద్యార్థులు హాజరు.
- విద్యార్థులతో ముచ్చటించి పరీక్ష సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్.
- రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు.



విశాలాంధ్ర - శ్రీకాకుళం: కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ఎర్రన్న విద్యా సంకల్పం లో భాగంగా ఆర్.ఆర్.బి, గ్రూప్ డి అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన రెండవ కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్ కు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం నాడు జరిగిన పరీక్ష సరళిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులతో ముచ్చటించారు. ప్రశ్నాపత్రం రూపొందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ మాక్ టెస్ట్ లో పాల్గొన్న విద్యార్థులు.. భవిష్యత్ లో జరిగే ప్రధాన పరీక్షలలో కూడా మంచి ప్రతిభ చూపి ఉత్తీర్ణత సాధించాలని శుభాకాంక్షలు అందించారు. కాగా గత నెల 28న ఇదివరకే మొదటి మాక్ టెస్ట్ జరగగా.. అందుకు కొనసాగింపుగా ఆదివారం శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో మరో పరీక్ష జరిగింది. ఈ రెండవ మాక్ టెస్ట్ ను రాసిన విద్యార్థులు పరీక్ష నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్.ఆర్.బి, గ్రూప్ డి ప్రధాన పరీక్షకు సన్నద్ధం చేసే దిశగా మాక్ టెస్ట్ ను నిర్వహిస్తున్నామని, ఇందుకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కొద్ది రోజుల క్రితం నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. మొదటి మాక్ టెస్టుకు తీసిపోని స్థాయిలో.. రిజిస్ట్రేషన్ ప్రకటన వెలువడటమే తరువాయి.. వెల్లువలా అభ్యర్థులు తమ వివరాలను పొందుపరిచి హాల్ టికెట్లు పొందారు. ఇందుకోసం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు అత్యంత పకడ్బందిగా ఆదివారం రోజున ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించారు. ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జిల్లాలో నిరుద్యోగాలకు ఉపాధి చేరువ చేసే మార్గాలను దగ్గర చేస్తున్నారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిఎస్సి, గ్రూప్స్, కానిస్టేబుల్, ఆర్.ఆర్.బి ఇలా పోటీ పరిక్షలు అన్నింటికీ సమాయత్తం అయ్యేలా యువతను సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి సైతం యువత తరలివస్తున్నారు. మాక్ టెస్టు నిర్వహించడం, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి అవసరమైన మెటీరియల్ అందివ్వడం, నిష్ణాతులచే తరగతులు చెప్పించడం, పరీక్షకు సన్నద్ధమయ్యేలా వారిని తీర్చిదిద్దే భాద్యత ఎర్రన్న సంకల్పం చేపట్టింది. సత్ఫలితాల సాధన దిశగా కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులు స్పష్టమైన ఫలితాలు సాధించడం ఇందుకు నిదర్శనంగా మారుతోంది. తాజాగా ఆదివారం రోజున జరిగిన కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్ లో మొత్తంగా 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్.ఆర్.బి కి తీసిపోని స్థాయిలో పరీక్షను నిర్వహించారని, ప్రశ్నాపత్రం కూడా ఆర్.ఆర్.బి స్థాయి విలువలతో ఉందని తెలిపారు. ప్రధాన పరీక్షలలో మంచి మార్కులు సాధించడానికి ఈ మాక్ టెస్టులు ఉపయుక్తంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇలాంటి పరీక్షను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కోటి సంతకాల ఉద్యమానికి ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - కవిటి : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేసేందుకు ప్లాన్ వేసిందని వాటిని అడ్డు కునేందుకు వైసీపీ చేస్తున్న కోటి సంతకాల ఉద్యమానికి ప్రజలు సహకరించాలని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం వరక గ్రామంలో కోటి సంతకాల ఉద్యమంపై ప్రజలకు అవగాహన కల్పించి సంతకాలకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పురియా శ్రీకాంత్, దూదయ్య, గుమ్మడి పురుషోత్తం,రాజేంద్ర,జగదీష్, జి.శివాజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎస్జీఎఫ్ సభ్యులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటి : కొఠారి గ్రామానికి చెందిన బండారు పావని కుమార్తె దీయా అనే 1 సంవత్సరం 6 నెలల చిన్నారి న్యూమోనియో వ్యాధితో బాధ పడుతుంది. శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో వెంటిలేటర్పై వైద్యం అందిస్తున్నారు. తల్లిదండ్రులు నిరుపేద కుటుంబం కావడంతో మెరుగైన వైద్యం కోసం దాతల సహకారాన్ని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న కవిటి మండలం ఎస్జిఎఫ్ సభ్యులు ఆదివారం ఆ కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. మరింత మంది దాతలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు బాబు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని ఎస్‌జిఎఫ్ సంస్థ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎస్జిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## సుమిత్ కుమార్‌కు రూ.5 లక్షల అవార్డు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మం డలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన రత్నాల కామేశ్వరరావు, ప్రమీల దంపతుల కుమార్డు సుమిత్ కుమార్ హైదరాబాద్ కెఎంఐటీ కాలేజీలో చదువుతూ విన్ టెక్ ఫెస్ట్ 2025- ముంబాయిలో బ్యాంకు లావా దేవీలు, పేమెంటు డేటాలో క్లిష్టమైన సమస్య పరిస్కారంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్ చేతుల మీదుగా రూ.5 లక్షల ప్రైజ్ మనీ మరియు అవార్డు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సుమిత్ కుమార్‌ను ప్రశంచించారు. అలాగే కవిటి శ్రీ చింతామణి సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఆయనకు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## భగవద్గీత పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విశాలాంధ్ర - కవిటి : టెక్కలిలో ఆల్ఫా జెన్ స్కూల్స్‌లో వేదం ఇంటర్నేషనల్ ఏఐ అకాడమీ వారు నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత మరియు మైథోలోజికల్ క్విజ్ పోటీలలో కవిటి మండలం జాడుపూడి ఆర్.ఎస్ కు చెందిన శ్రీ విజేత స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ పోటీలలో శివసాయి సాహు, సాలిన లోకేశ్వరరావులు ప్రథమ, ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కరెస్పాండంట్ పి.రాంకుమార్, బి.విజయభాస్కర్, ఉపాధ్యాయ సిబ్బంది బి.అనిత, పి.రమ్యశ్రీలు విద్యార్థులకు అభినందించారు.

విశాలాంధ్ర
పేజి: 2
శ్రీకాకుళం
సోమవారం 13, అక్టోబర్, 2025

## నేడు మంత్రి నాదేండ్ల మనోహర్ జిల్లాలో పర్యటన

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** జిల్లాలో పౌర సరఫరాల శాఖ పై ప్రాంతీయ సమావేశం ఈ నెల 13వ తేదీన ఉంటుందని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ ఆదివారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ ఎఎస్ఆర్, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొంటారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాయంత్రం 3 గంటలకు మిల్లర్స్ అసోషియేషన్, ధాన్యము సేకరణ సంస్థలు, రైతు సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

# కుక్కలు జోరు... ప్రజలు బేజారు..

**విశాలాంధ్ర - కవిటి :** వీధి కుక్కల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒంటిరిగా తిరగాలంటే భయపడేలా కుక్కలు వ్యవహరించడం విచారకరం. ముఖ్యంగా చిన్న పిల్లలు, ముసలి వాళ్ళు ఒంటిరిగా పోలాలకు వెళ్ళేవాళ్లపై కుక్కలు దాడులు చేసి గాయ పరుస్తున్నాయి. గ్రామాల్లో ప్రధాన రహదారిపై మండల పరిధిలో రాత్రి 7గంటలు దాటితే బయట తిరిగే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుక్కలను పట్టుకొని నియంత్రించే వారని, గత ఐదేళ్ళ నుంచి అటువంటి కార్యక్రమాలు ఏమీ చేయడం లేదని వాపోతున్నారు. రహదారులపై, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నవారి వెంట బడుతున్నాయని చెబుతున్నారు. మండలంలో కవిటి, జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం తదితర గ్రామాలలో ఇటీవల కుక్కలు బెడద అధికంగా ఉంది. గత నాలుగు రోజుల క్రితం మాణిక్యపురం గ్రామంలో వీధి కుక్కలు సుమారు 15 మందిపై దాడి చేశాయి. అందులో శృంగారపు నాగేశ్వరరావు కు తీవ్రంగా గాయపరచి, మోహన్ బిసాయికి కాలుపై స్వల్పంగా గాయాలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఇద్దరు సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కవిటి మండలంలో 22 పంచాయతీ లలో కుక్కలు సుమారు 1500 నుండి 2000 వరకు వుంటాయని ఇవి 20 నుండి 30 గుంపు గుంపులుగా వీధులలో తిరుగుతుండటం భయంతో ఒక్కొక్కరు బయటకు రావడం మానేశారు. ఇక లేగదూడల విషయానికి వస్తే పాడి రైతులు కుక్కలకు భయపడి లేగ దూడలను ఇంటి వద్ద సంరక్షిస్తుంటారు. ఇటీవల కాలంలో పి వై జి పుట్టుగ, శిలగాం, నర్తుపట్టుగ తదితర గ్రామాల్లో కుక్కలు గొర్రెల మందలు, ఆవుల పై దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇలా చాలా మంది కుక్కల దాడిలో గాయపడటంతో పాటు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. కుక్కల బారి నుంచి ప్రజలకు, చిన్నారులకు రక్షణ కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వందకు పైగా వీధి కుక్కలు మండల కేంద్రం నుంచి చుట్టుపక్క గ్రామాలు తిరుగుతూ పశువులను, మేకలను కరిచి తినడంతో పాటు నేడు మనుషుల్ని కరిచి గాయ పరుస్తున్నాయని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి కుక్కలను నిర్మూలించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, మహిళలు, వృద్దులు నిత్యవసర వస్తువులు కోసం బజారు వెళ్లాలన్నా భయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులంతా స్పందించి పంచాయతీలకు బాధ్యత అప్పజెప్పి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. మండల కేంద్రంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో అధికశాతం మాంసం దుకాణాలు ఏర్పాటు కావడంతో మాంసం ముక్కలు తినటం అలవాటు పడడంతో ఇప్పుడు ప్రజల పైన దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల గుంపు నుంచి మరిన్ని ప్రమాదాలు జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయిలో రజత పతకం మహిధర్ నాయుడు

**విశాలాంధ్ర - టెక్కలి :** రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో అట్టాడ మహిధర్ నాయుడు రజత పతకం కైవసం చేసుకున్నారు. రేపల్లె వేదికగా ఈ నెల 10, 11 తేదిల్లో నిర్వహించిన తైక్వాండో క్రీడలో టెక్కలి అరుణ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న మహిధర్ నాయుడు 38 కేజీల వెయిట్ క్యాటగిరీలో సత్తా చాటాడు. అంతకు మునుపు శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో పోటీ పడి రాష్ట్రా స్థాయికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం మహిధర్ నాయుడు ప్రతిభను అభినందించారు.

## రాజమండ్రిలో మండల వాసి మృతి

**విశాలాంధ్ర - సంతబొమ్మాళి :** మండలంలో లక్కివలస పంచా యతీ గెద్దలపాడు గ్రామానికి చెందిన తుంబల చిరంజీవి (25) అనే మత్స్యకార యువకుడు శని వారం రాత్రి రాజమండ్రిలో జరిగిన బైక్ యాక్సిడెంట్ లో మృతి చెందాడు. రాజమండ్రిలో ఓ హోటల్ లో ఐదేళ్లుగా కుక్ మాస్టర్ గా పనిచేస్తున్నారు. ఇటీవల స్వగ్రామం వచ్చి పది రోజుల కిందట రాజమండ్రి వెళ్లారు. బైక్ మీద వెళ్తున్న చిరంజీవి ఓవర్టేక్ చేయబోయి లారీ కింద పడి మృతి చెందారు. కుమారుడి మరణ వార్త విని తండ్రి గురువులు తల్లి, ఆదెమ్మ కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర - సంతబొమ్మాళి :** సంతబొమ్మాళి మండలం, ఆర్.హెచ్ పురం, జగన్నాథపురం పంచాయతీలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ, కోటిసంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం పోస్టర్ ను, టెక్కలి నియోజకవర్గ ఇంచార్జి పేరాడ తిలక్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు బుడ్డ మోహనరెడ్డి, జిల్లా అధికార పార్టీ ప్రతినిధి సత్తారు సత్యం, సర్పంచ్లు ఎన్ని మన్మధరావు, జోగి రాములమ్మ, వైస్ ఎంపిపి నక్క భీమరావు, కోటబొమ్మాళి ఎంపిపి ఉమా మల్లయ్య, హేమసుందర్ రాజు, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షులు వినోద్, ఎంపిటిసి జొన్న సవరరాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కోత సతీష్, మార్పు నాగభూషనరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు డొక్కర నీలకంఠం, టంకాల బాబురావు, మోహనరావు, టంకాల చిరంజీవి, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీల సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 13 నుంచి 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' ఉత్సవాలు

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** జీఎస్టీ 2.0 విజయోత్సవాలను పురస్కరించుకుని "సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" పేరుతో నెల రోజుల ఉత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 13 నుంచి 19 వరకు ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ప్రత్యేక ప్రదర్శనలు జరగనున్నాయి. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల ప్రకారం, వివిధ విభాగాలు స్టాళ్ల ఏర్పాటు చేయనున్నాయి. ప్రజలకు జీఎస్టీ వల్ల కలిగిన సేవింగ్స్‌ను చూపించడానికి ప్రతీ స్టాల్‌లో ప్రీ జీఎస్టీ ధర, పోస్ట్ జీఎస్టీ ధర, సేవింగ్స్ శాతం వివరాలు చూపించనున్నారు. ఆటోమొబైల్స్ స్టాళ్ల ఏర్పాటుకు రవాణా శాఖ, ఎలక్ట్రానిక్స్, కిచెన్ వస్తువులు, మొబైల్ ఫోన్ల స్టాళ్లకు కమర్షియల్ టాక్స్ విభాగం, మున్సిపల్ కమిషనర్, "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కింద ఏపీసీవో, లేపాక్షి సంస్థలు, పొందూరు చేనేత, ఇత్తడి, హస్త కళల వస్తువులు ప్రదర్శించనున్నారు. సోలార్ పరికరాలు ఎనర్జీ శాఖ ఆధ్వర్యంలో, ఫుడ్ కోర్టులు ఫుడ్ సేఫ్టీ లేదా టూరిజం శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా సామాగ్రి స్టాళ్లు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉత్పత్తులు ప్రజలను ఆకట్టుకునేలా ఉండనున్నాయి. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని, జీఎస్టీతో వచ్చిన సేవింగ్స్ ప్రయోజనాలను తెలుసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలు

**విశాలాంధ్ర - ఎచ్చెర్ల :** సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలకు అవకాశమని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఆప్షన్మేట్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ (హైదరాబాద్)తో ఒప్పందం కుదుర్చు కుని ఈ క్యాంపస్లోలో ఆదివారం డాక్టర్ ఏపీ అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ఇంక్యుబేషన్ సెంటర్ వేదిక కావాలన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇంక్యుబేషన్ కేంద్రం దోహదపడుతుందన్నారు. ఆప్షన్మేట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.శశికుమార్ మాట్లాడ తూ విద్యార్థులు సృజనాత్మకత ఆలోచనలతో ముందుకు వస్తే సంస్థ ద్వారా అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ పరిపాలనాధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఎస్.రామకృష్ణ, ఎఫ్వో సీహెచ్.వాసు, ఎంటర్ప్రెన్యూర్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్. సతీష్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఫీల్డ్‌కి వెళ్ళరు. ప్రజారోగ్యం పట్టించుకోరు..

**- ఏసీ రూములకే పరిమితమైన ఫీల్డ్ సిబ్బంది, వృధా అవుతున్న ఎఫ్‌టిఏ**

**- వైద్యుల సమ్మెతో ఇష్టారాజ్యం**

**విశాలాంధ్ర - సంతబొమ్మాళి :** ప్రతిరోజు పీహెచ్సీకి వచ్చి అటెండెన్స్ బయోమెట్రిక్ వేసుకొని ఫీల్డ్ లో తిరిగి క్రింది స్థాయి వైద్య సిబ్బంది పనితీరును ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోవాల్సిన ఫీల్డ్ వైద్య సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు . వివరాల్లోకి వెళితే నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఈఓ ఫీల్డ్ కు వెళ్ళకుండానే మూమెంట్ బుక్ లో వారికి నచ్చిన రూటుని రాసుకోవడం, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశల పనితీరును ఫీల్డ్ కు వెళ్లి పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ అవేవీ పట్టించుకోకుండా ఆరోగ్య కేంద్రంలోని బసవేస్తున్నారు. వీరి పర్యవేక్షణ కొరవడంతో క్రింది స్థాయి సిబ్బంది పనితీరు అంతంతమాత్రంగానే ఉందని ఆరోపణలు వస్తున్నాయి. వైద్యాధికారులకు అడ్వాన్సుడ్ టూర్ ప్రోగ్రాం (ఏటీపీ) ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అది కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. అలాగే ఎంపీహెచ్ఈఓ ఫీల్డ్ లో తిరిగి వైద్య సిబ్బంది పనితీరు పర్యవేక్షించేందుకు ఎఫ్ టి ఏ ( ఫిక్సిడ్ ట్రావెల్ అలవెన్స్ )ఇస్తున్నప్పటికీ ప్రతి ఏడాది ఎఫ్ టి ఏ తీసుకుంటున్నారే తప్ప ప్రతీ రోజు ఫీల్డ్ కి వెళ్ళేది లేదని తెలుస్తోంది. ఫీల్డ్ లో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే లక్ష్యంతో వీరిని ప్రభుత్వం నియమించినప్పటికీ వీరి విధులు మాత్రం అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. ఎంపీహెచ్ఈఓ పర్యవేక్షణ లోపంతో కొంతమంది వైద్య సిబ్బంది సకాలంలో బాధితులకు సరైన వైద్యం అందించక బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనా ఎంపీహెచ్వో ఆసుపత్రికి వస్తారు.. వెళ్తారు అనే తీరు కాకుండా ప్రతిరోజు ఫీల్డ్ కి వెళ్లి వైద్య సిబ్బందితో పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**అటకెక్కిన పర్యవేక్షణ :**

నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై గతం నుండి ఇప్పటివరకు పలుమార్లు పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ పర్యవేక్షణ మాత్రం గాడి తప్పిందని ఆరోపణలు ఉన్నాయి. ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణ నిర్వహించాల్సిన జిల్లా వైద్యాధికారులు మౌనంగానే ఉంటూ జిల్లాకే పరిమితవుతున్నారు. గత కొన్నేళ్లగా డిఎం అండ్ హెచ్ ఓ పర్యవేక్షణ, తనిఖీలు మచ్చుకైనా లేకపోవడంతో క్రింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి సిబ్బంది వరకు ఇస్తారాజ్యంగా మారిందని బహిరంగ విమర్శలు ఉన్నాయి . నౌవడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్స్ కొరత ఉన్నప్పటికీ ఉన్నత స్థాయి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో జిల్లా వైద్యాధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

## జిల్లా సాఫ్ట్‌బాల్ సెలక్షన్ పోటీలు

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ సెలక్షన్ పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం, రాష్ట్రస్థాయి పోటీలకు ఉత్తమ ఆటగాళ్లను ఎంపిక చేయడం లక్ష్యంగా ఈ సెలక్షన్ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ "జిల్లా స్థాయిలో క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చూపేలా ప్రతి ఆటగాడు శ్రమించాలని అన్నారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక సహాయకుల సమస్యలు పరిష్కరించండి

### డెమోక్రటిక్ జాక్ ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి కిరణ్ కుమార్

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** పశుసంవర్ధక సహాయకులుగా మేము పశుసంవర్ధక శాఖ (అనిమల్ హస్బెండ్రీ డిపార్ట్మెంట్) లో పూర్తిస్థాయిలో విలీనం చేయడమే మా ప్రధాన డిమాండ్ అని ప్రస్తుతం మేము జీఎస్ డబ్ల్యుఎస్ వ్యవస్థలో పనిచేస్తున్నప్పటికీ, మా నైపుణ్యానికి అనుగుణంగా విలీనం చేయడం ద్వారా, మా సేవల వినియోగాన్ని సమర్థవంతంగా ఉపయోగించవచ్చన్నారు. అలానే మాకు సంబంధం లేని ఇతర శాఖల అదనపు విధులు, సర్వేలు వంటివి నుంచి మినహాయించాల్సిందిగా కోరారు. జీఎస్‌డబ్ల్యు ఆప్షన్ పునరుద్ధరణ చేయాలని, తాము పశు ఆర్ఎస్‌కె లేదా హాబిటేషన్ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్నప్పుడు, లేదా ఇన్‌చార్జ్ సచివాలయ విధులు అప్పజెప్ప బడినప్పుడు, అటెండెన్స్‌లో అథర్స్ ఆప్షన్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనిని తిరిగి అమలులోకి తీసుకురావాలని కోరారు. మేము కూడా ఇతర సచివాలయ ఉద్యోగుల మాదిరిగా, నోషనల్ ఇంక్రిమెంట్లు, రావలసిన డీఏలు, మధ్యంతర భృతి, పీఆర్‌సీ లబ్ధి పొందాల్సిన హక్కు కలవారమేనని, ప్రభుత్వం దీనిపై తక్షణం స్పందించి, పశుసంవర్ధక సహాయకుల హక్కులను కాపాడాలని కోరుతున్నామన్నారు. గ్రామీణ స్థాయిలో పశు వైద్య సేవల ప్రధాన భాగస్వాములమై, వివిధ విధులు నిర్వర్తిస్తూ నిత్యం రైతులకు, పశుపాలకులకు తోడుగా ఉండే మేము, పై డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు గమనించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మీకెందరు మిత్రులు... జీవితంలో ఆ నలుగురు చాలంటున్న యువత..

**విశాలాంధ్ర - కవిటి :** నిజ జీవితంలో తనకంటూ ఓ నలుగురు మిత్రులను సంపాదించుకోవడం ఒక విధంగా ఎంతో అదృష్టం అని యువత తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. ఆపద వచ్చేటప్పుడు ఎంత వరకైనా మేమున్నామంటూ ఆర్థిక భరోసా తోపాటుగా అండగా ఉండే నలుగురు స్నేహితులను పొందడం ఎంతో అదృష్టంగా భావించవచ్చు. నేటి సమాజంలో బంధువులు చుట్టాలు కన్నా స్నేహితులే ఆత్మీయ బంధువులుగా వ్యవహరిస్తూ కష్టకాలంలో మేమున్నామంటూ ముందుకు వస్తున్న సందర్భాలు ఎన్నో చూస్తున్నాం. తల్లిదండ్రులు కుటుంబసభ్యుల తరువాత మన జీవితాలను ఎక్కువగా ప్రభావితం చేసేది మిత్రులే. చిన్నప్పుడు ఆడుకున్న ఇరుగూ పొరుగూ పిల్లలతో మొదలెట్టి స్కూల్లో కాలేజీలో యూనివర్సిటీలో ఆతరవాత ఉద్యోగంలో ఎందరో స్నేహితులవుతారు. వారిలో ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చే క్లోజ్ ఫ్రెండ్స్‌గా మిగిలేది ఎందరు. అలాంటి జిగిరీ దోస్తులు మీకెంతమంది ఉన్నారు. పరిచయమైన వారంతా స్నేహితులూ కారు, స్నేహితులైనవారంతా సన్నిహితులూ కాలేరు. స్నేహాల్లో చాలా రకాలున్నాయి. మనకు చాలా అవసరం ఉన్నప్పుడే కొందరు ఉన్నట్లుండి దూరంగా జరిగిపోతారు. ఇంకొందరు తమ అవసరానికి మన స్నేహితుల అవతారమెత్తితే, మరికొందరు మనకేమాత్రం పరిచయం లేకపోయినా ఆపదలో అండగా నిలబడతారు. అందుకే మంచి మిత్రులు ఎవరూ అన్నది నిర్ణయించుకోవడానికి కొంచెం కష్టపడాలి. ఒంటరైనా ఓటమైనా వెంటనడిచే నీడ నీవే అని హ్యాపీడేస్ సినిమా పాటలో చెప్పినట్లు మనల్ని అంటిపెట్టుకుని ఉండేవారే నిజమైన స్నేహితులు. అలాగని మిగిలినవాళ్లంతా కారా అంటే- వాళ్లూ ఫ్రెండ్సే కాకపోతే కాస్త తేడా ఉంది. ప్రఖ్యాత ఆంత్రోపాలజిస్ట్ రాబిన్ డన్‌బర్ స్నేహాల మీద చాలా అధ్యయనాలు చేసి రూపొందించిన సిద్ధాంతం ప్రకారం ఎవరికైనా అత్యంత సన్నిహిత మిత్రులు అయిదుగురే ఉంటారట. ఆ తరవాత 15 మంది మంచి మిత్రులు ఉంటారు. మరో 150 మంది దాకా అర్థవంతమైన పరిచయం ఉన్నవాళ్లు ఉంటారు. ఈ స్థాయి వరకే మనం స్నేహబంధాన్ని నిర్వహించుకోగలమట. ఆ పరిధి దాటాక ఇంకో 500 మంది పరిచయస్తులు, 1500 మంది దాకా మనం గుర్తు పట్టగలవాళ్లూ ఉంటారట. ఇదొక్కటే కాదు, మరికొన్ని అధ్యయనాలు కూడా మనిషికి సన్నిహిత మిత్రుల సంఖ్య ముగ్గురి నుంచి అయిదుగురికే పరిమితమని తేల్చాయి. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఒక కథ వైరల్ అయింది. కొడుకు ఎప్పుడూ ఫోన్‌లో కాలక్షేపం చేస్తోంటే తండ్రి కోప్పడతాడు. ఊరుకో నాన్నా. ఇక్కడ నాకు రెండువేల మంది ఫ్రెండ్స్ ఉన్నారు తెలుసా అని గర్వంగా చెబుతాడు కొడుకు ఒకరోజు ఇద్దరూ బైక్‌మీద వెళ్తాండగా ప్రమాదం జరుగుతుంది. దెబ్బలు తగిలి ఆస్పత్రిలో చేరతారు. తమ పరిస్థితి గురించి సోషల్‌మీడియాలో పోస్టు పెడతాడు కొడుకు. అందరూ గెట్‌వెల్ సూన్ బ్రో అంటూ మెసేజ్‌లు పెడతారు కానీ ఒక్కరు కూడా ఆస్పత్రికి రారు. అదే తండ్రి ఒక్క స్నేహితుడికి ఫోన్ చేసి తాను ఆఫీసుకు రాలేకపోతున్నట్లు చెబుతాడు, అంతే, ఆఫీసులో సహోద్యోగులు, వాకింగ్ ఫ్రెండ్స్, కాలేజి ఫ్రెండ్స్ ఇలా గుంపులు గుంపులుగా రావడం, పండ్లూ తదితరాలు తెచ్చివ్వడం, ఏమైనా సాయం కావాలంటే చెప్పమనడం జరుగుతూనే ఉంటుంది. తండ్రి స్నేహితుల అభిమానం చూసి బిత్తరపోతాడు కొడుకు. ఎంతమంది స్నేహితులున్నారన్నది కాదు, వారి స్నేహంలో నాణ్యత ఎంతన్నది ముఖ్యం. ఎందుకంటే మన ఆనందాన్నీ ఆయుర్దాయాన్నీ పెంచే ముఖ్యమైన అంశాల్లో మంచి స్నేహం కూడా ఒకటి అని చెప్పవచ్చు.

## విశ్వ గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం

### కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొండు శంకర్

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** శ్రీకాకుళంలో గల బాపూజీ కళామందిర్‌లో సుస్వర సంగీత లహరి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే శంకర్ హాజరయ్యారు. కార్య క్రమంలో శంకర్ మాట్లాడుతూ ఎస్పీ బాల సుబ్రమణ్యం సంగీతంలో రారాజు గా వెలుగొందరు. వేల పాటలు పాడి తెలుగువారికి ఎనలేని గుర్తింపు తెచ్చారు. బాలు లేని పాటలు ప్రపంచంలో ఎంతోమంది యువ గాయకులు ఆయన బాటలో నడుచుకుంటారని తెలుపుతున్నాను. ఎన్నో పాటలతో మనల్ని ఉర్రూతలూగిస్తూ ఈ గాన చంద్రుడు మనల్ని విడిచి ఐదు సంవత్సరాలు అయినందున ఈ కార్యక్రమాన్ని అతన్ని గుర్తు చేస్తున్నందుకు ఈ కార్యక్రమం చేసిన ప్రతి ఒక్కరికి అభినందించారు.